క్లుప్తంగా

14వ వార్డులో బోరుపంపు ఏర్పాటు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో ప్రజల తాగునీటి అవసరాలకు ఏర్పాటు చేసిన నూతన బోరుపంపును వార్డు కౌన్సిలర్ నల్లమోతు లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గురువారం ప్రారంభించారు. కొంతకాలంగా నీటి ఎద్దడి తలెత్తడంతో ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా స్పందించిన ఆయన రూ.లక్ష మంజూరు చేయించారు. నాయకులు లంకే అంకమోహనరావు, నల్లమోతు రవి, ప్రకాశ్, చిన్నయ్య, బత్తుల కృష్ణ పాల్గొన్నారు.

వాటర్ పంప్ హౌస్ పరిశీలించిన కౌన్సిలర్లు

ఇబ్రహీంపట్నం: ఆర్‌డబ్ల్యూఎస్ పంప్ హౌస్‌ను కొండపల్లి మున్సిపాలిటీ వార్డు కౌన్సిలర్లు గురువారం పరిశీలించారు. ఇటీవల కాలంలో పంప్‌హౌస్‌లో మోటార్లు మరమ్మతులకు గురికావడంతో తాగునీటి సరఫరాలో అవాంతరాలు తలెత్తాయి. విషయాన్ని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన అధికారులతో మాట్లాడారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కరించి తాగునీటి సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలన్నారు. కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు కుమ్మరి శ్రీనివాసరావు, మోటూరి సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ ఆర్కే ఇంజినీరింగ్ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కాకినాడ డిజైర్ ఆఫ్ క్రైస్ట్ మినిస్ట్రీస్ పాస్టర్ జేమ్స్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ కె.రామకృష్ణయ్యతో కలిసి కేక్ కట్ చేసి విద్యార్థులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. బ్రదర్ జేమ్స్‌ను సత్కరించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడు, మాజీ సర్పంచ్ నాగేశ్ మృతి



చిలుకూరు(ఇబ్రహీంపట్నం): మండలంలోని చిలుకూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు, మాజీ సర్పంచ్ దొంతమాల నాగేశ్(105) వయోభారంతో అనారోగ్యానికి గురై గురువారం మృతిచెందారు. 1918లో జన్మించిన నాగేశ్ కమ్యూనిస్ట్ భావాలతో యుక్త వయస్సులో ఉద్యమబాట పట్టారు. 1967లో చిలుకూరు గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికై వరుసగా 18 ఏళ్లు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. నాగేశ్ మృతదేహాన్ని నాయకులు, సర్పంచులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

ఆగిరిపల్లిలో పంచకర్మ చికిత్స కేంద్రం మంజూరు



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో పంచకర్మ చికిత్సా కేంద్రాన్ని మంజూరు చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆయుష్ శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్‌బీ రాజేంద్రకుమార్ తెలిపారు. ఇటీవల ఆగిరిపల్లి హోమియో వైద్యశాలకు ఆధునీకరణ నిమిత్తం నిధులు మంజూరు చేశారు. గురువారం ఆయుష్ కమిషనర్ భవన ఆధునీకరణ పనులను పరిశీలించారు. ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న పాత భవనాన్ని పరిశీలించి దీనిని కూడా ఆధునీకరించి ఆయుర్వేద పంచకర్మ చికిత్స కేంద్రంగా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్టు, వైద్యులను, ఇద్దరు యోగ గురువులను, సిబ్బందిని నిమిస్తామని, మందులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ రజిత, సర్పంచ్ చౌటుపల్లి లక్ష్మి, యండూరి ప్రణీత్, కుందా శ్రీనివాసరావు ఆయుష్ సిబ్బంది, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ వ్యాధిని గుర్తించాలి

చాట్రాయి: ఫ్లోరోసిస్ వ్యాధిని గుర్తించేందుకు సర్వే నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. మండలంలోని నరసింహారావుపాలెం, తుమ్మగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. తాగునీటిలో పరిమితికి మించి ఫ్లోరైడ్ ఉంటే దంతాలు, ఎముకలపై ప్రభావం చూపుతుందన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఎన్నికల హామీలు నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



చంద్రాలలో జ్యోతి ప్రజ్వలను చేసి ఆర్బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, నాయకులు

చంద్రాల(మైలవరం): ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో రూ.81.80 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్బీకేలను గురువారం ఎమ్మెల్యే వసంత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 2019 ఎన్నికల ముందు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిందన్నారు. చంద్రాల గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం భవనం, రూ.21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవనాన్ని, రూ.20 లక్షలతో నిర్మించిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. చంద్రాల గ్రామంలో గడిచిన నాలుగేళ్లలో తమ ప్రభుత్వం రూ.41 కోట్లతో అమ్మ ఒడి, ఆసరా, చేయూత, పింఛన్లు, విద్యా దీవెన, సంక్షేమ పథకాలు అమలు, రూ.4.57 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సొసైటీ భవనం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సిమెంట్ రహదారులు, డ్రెయినేజీలు, సచివాలయం, ఆర్బీకే తదితర అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. వివాదాలకు తావులేకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు జొన్నలగడ్డ గంగాధరరావు సేవలందిస్తున్నారని అభినందించారు. అవినీతి, వివక్షకు తావు ఇవ్వకూడదని, పరిపాలన అన్నది ప్రజలకు చేరువ కావాలన్న ప్రధాన ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు. గ్రామ సర్పంచ్ జె. జ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు జి.వెంకట్రావు, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్ తిరుపతిరావు, చిలుకూరు రామకృష్ణారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చంద్రాల(మైలవరం): మిచాంగ్ తుఫాన్ వలన కలిగిన ఇబ్బందుల వలన రైతులు నష్టపోకుండా ఉండేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో సహకార సంఘం కార్యాలయంలో వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వసంత, ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ రైతు విభాగం అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావుతో కలిసి గురువారం ప్రారంభించారు. రైతుల వద్ద నుంచి శ్రేష్ఠమైన ధరకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని, గ్రామాల్లో దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ప్రెసిడెంట్ నాగమల్లేశ్వరరావు, సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాలు ప్రారంభం

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ఇంధన పొదుపు వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. సర్వీస్ భవనం నుంచి సంస్థ ప్రధాన గేటు వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పి.నవీన్‌గౌతమ్ మాట్లాడుతూ మన అవసరాలకు ముడిచమురు 75 శాతం దిగుమతి ద్వారా వస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న వనరులు దాదాపు 40 ఏళ్లు మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. బొగ్గు, చమురు, సహజ వాయువులు ఏర్పడటానికి వేల ఏళ్లు పడుతాయన్నారు. ఇంధన పొదుపు పాటించాలని సూచించారు. సీనియర్, జూనియర్ ఇంజినీర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంధన పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

మైలవరం: ఇంధన పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పరిరక్షణ దినోత్సవంలో భాగంగా విద్యార్థులు గురువారం పవర్ పాయింట్, పోస్టర్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ.. ఇంధన పరిరక్షణ ఆవశ్యకత, దైనందిన జీవితంలో ఇంధనాన్ని పొదుపు చేసే సూచనలు వివరించారు. ప్రదర్శనలో భాగంగా విద్యార్థులు మైలవరం, పరిసర గ్రామాల్లో పర్యటించి ఇంధన పరిరక్షణ ఆవశ్యకతను, పరిరక్షించే విధానాలపై కరపత్రాలను పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భౌతికశాస్త్ర విభాగాధిపతి వి.ఉమాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

నూజివీడు: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రను నూజివీడు మండలంలో శుక్రవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీపీ విజయ్‌కుమార్ గురువారం తెలిపారు. దీనిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం చేస్తామన్నారు. శుక్రవారం మర్రిబంధం, సీతారామపురం, 16న పల్లెర్లమూడి, ఎంఎస్‌పాలెం, 17న మీర్జాపురం, గొల్లపల్లి, 18న వెంకటాయపాలెం, పోలసానపల్లి, 19న దేవరగుంట, జంగంగూడెం, 20న పోతురెడ్డిపల్లి, ముక్కొల్లుపాడు, 21న దిగవల్లి, తూర్పు దిగవల్లి, 22న హనుమంతులగూడెం, అన్నవరం, 23న కొత్తరావిచర్ల, పాతరావిచర్ల, 26న తుక్కులూరు, సుంకొల్లు, సిద్ధార్థనగర్, బోర్వంచ, 27న యనమదల, బత్తులవారిగూడెం, మొర్సపూడి, 29న రామన్నగూడెం, 30న ఓగిరాల తండా, కొత్తూరు తండా, 31న మిట్టగూడెంలలో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర జరుగుతుందని తెలిపారు.

పథకాలు కొనసాగాలంటే జగనన్నే సీఎం కావాలి

పెనుగొలను(గంపలగూడెం): రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు కొనసాగాలంటే జగనన్నే మరోసారి సీఎం కావాలని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి అన్నారు. పెనుగొలను సచివాలయం పరిధిలో గురువారం రాత్రి పల్లెకు పోదాం, వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాలను నిర్వహించారు. సచివాలయం వద్ద పథకాల ద్వారా పొందిన లబ్ధి వివరాలతో ఏర్పాటు చేసిన డిస్ ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం కూడలిలో పార్టీ జెండాను ఎమ్మెల్యే ఎగురవేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పెనుగొలను-1 సచివాలయం పరిధిలో రూ.37 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోట శామ్యూల్, సర్పంచ్ సంగెపు లలిత, ఎంపీటీసీ సభ్యులు వి.శ్రీను, పార్టీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు గోగులమూడి చెన్నకేశవరెడ్డి, చెరుకు నర్సారెడ్డి, మాజీ ఎంపీపీ కోట దాసు, బొల్లా కరుణాకరరావు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

ఆగిరిపల్లి: మండలంలోని సూరవరంలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం గురువారం నిర్వహించారు. సురవరం, కొమ్మురులో రూ.22 కోట్లతో చేకూరిన సంక్షేమ లబ్ధి వివరాలను తెలియజేసే బోర్డును జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, సర్పంచ్ కోసూరి ఏసు, ఎంపీటీసీ పరసా కోటేశ్వరరావు, ఈవోపీఆర్డీ శేఖర్, భాస్కర్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వజ్రాయుధం

ముసునూరు: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ తెలిపారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి తహసీల్దార్ దాసరి సుధ ఆధ్వర్యంలో చింతలవల్లి గ్రామ ఓటర్లకు ఓటు హక్కు సద్వినియోగంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా నిష్పక్షపాత ఓటింగ్‌తో ప్రజాస్వామ్యంలోని చీకట్లను పారదోలాలని క్యాండిల్ సర్వీస్‌తో తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పి.సుధాకర్, ఓటర్లు పాల్గొన్నారు.

కలప అక్రమ తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు

నూజివీడు: మండలంలోని తుక్కులూరులో ఉన్న అడవి ఆంజనేయస్వామి గుడి పక్కన ఉన్న భారీ రావి చెట్టును అక్రమార్కులు గురువారం నరుకుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. నరికిన కలపను ట్రాక్టర్లలో తరలించారని, ఆ కలప దాదాపు 5 టన్నులు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. భారీ వృక్షాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా నరుకుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరించారని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు ఫోన్‌లు చేసి, ఫొటోలను వాట్సప్‌లలో పంపితే ఎట్టకేలకు ఒక వీఆర్వోను పంపి అధికారులు చేతులు దులుపుకున్నారు. నీరు, భూమి, చెట్టు పరిరక్షణ చట్టం(వాల్టా) ప్రకారం సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదని, అటవీశాఖ అధికారులైతే అటువైపు కూడా కన్నెత్తి చూడలేదని స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

మొర్సుమల్లి(మైలవరం): రైతులు తాము పండించిన పంటలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకుని లబ్ధి పొందాలని వైఎస్సార్‌సీపీ మొర్సుమల్లి గ్రామ పార్టీ నాయకుడు మాడపాటి శ్రీనివాసరావు తెలిపారు. మొర్సుమల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని శ్రీనివాసరావు గురువారం ప్రారంభించారు. ఆర్బీకే సిబ్బంది, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు. మండలంలోని వెల్వడం గ్రామంలో వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు యరమల నరసింహారెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. తోట తిరుపతిరావు, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

17న విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

మైలవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 17న ఉదయం 10 గంటలకు మైలవరం విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో 75 ఏళ్లు నిండిన విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్నట్లు అధ్యక్షుడు జన్నవరపు నాగిరెడ్డి గురువారం తెలిపారు. సన్మాన గ్రహీతలు, పాలకవర్గ సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

తపాలా ఉద్యోగుల ధర్నా

తిరువూరు: అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు తిరువూరు డివిజన్‌లోని గ్రామీణ తపాలా ఉద్యోగులు మూడో రోజైన గురువారం సమ్మెలో పాల్గొన్నారు. తమ సర్వీసు నిబంధనల్లో మార్పులు చేయడంతో పాటు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సదుపాయాలు కల్పించాలని యూనియన్ నాయకుడు లక్ష్మణరావు తెలిపారు. జీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో పరిశుభ్రత పాటించాలి

విస్సన్నపేట: గురుకుల పాఠశాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి ఆదేశించారు. స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఎంపీపీ గురువారం పరిశీలించారు. సెప్టిక్ ట్యాంక్ నిండిపోవటంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నట్లు వచ్చిన సమాచారంతో గురుకుల పాఠశాలను సందర్శించామన్నారు. మరుగుదొడ్ల వద్ద దుర్వాసన రాకుండా బ్లీచింగ్ చల్లించాలని సిబ్బందికి ఎంపీపీ సూచించారు. నీటి కుళాయిలు వద్ద పాకుడు పేరుకుపోయి ఉందని శుభ్రం చేయించాలన్నారు. త్వరలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేయిస్తామని ప్రిన్సిపాల్ ఎంపీపీకి చెప్పారు. కొన్ని గంటల్లోనే క్లీనింగ్, బ్లీచింగ్ చేయించామని ప్రిన్సిపాల్ జాన్సన్ దేవరాజ్ తెలిపారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

ఇబ్రహీంపట్నం/జి.కొండూరు/రెడ్డిగూడెం/గంపలగూడెం: జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశాల మేరకు మండలంలోని వివిధ సెక్టార్ల సూపర్‌వైజర్ల సమక్షంలో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు తీశారు. సెంటర్లలో ఉన్న వస్తువులను సచివాలయ మహిళా సంరక్షణ అధికారులు, గ్రేడ్ 5 కార్యదర్శులకు అప్పగించారు. జి.కొండూరు మండల పరిధిలోని 61 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీఓ అనూరాధ తెరిచారు. రెడ్డిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి రికార్డులు స్వాధీనం చేసుకున్నామని ఈవోపీఆర్డీ ఇన్‌చార్జి మీరా తెలిపారు. గంపలగూడెం మండలంలో 78 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తుండగా వాటిలో మొదటి రోజు 50 కేంద్రాలను గ్రామ నోడల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో తాళాలు తెరిచి స్వాధీన పరచుకున్నారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



జి.కొత్తూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రక్షణనిధి, నాయకులు

జి.కొత్తూరు(తిరువూరురూరల్): గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలన గ్రామస్థాయికి చేరువైందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. తిరువూరు మండలంలోని జి.కొత్తూరులో రూ.80 లక్షలతో నిర్మించిన సచివాలయ, వెల్‌నెస్, ఆర్బీకే భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సచివాలయాలను ఏర్పాటు చేశారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విద్య, వైద్యం అందించే దిశగా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంస్కరణలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. సచివాలయ వలంటీర్ వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు సైతం అనుసరిస్తున్నాయని చెప్పారు. ఎంపీపీ గద్దల భారతి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, సర్పంచ్ శీలం వెంకటరావమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు యరమల రాధమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు, ఈవోపీఆర్డీ వెంకటరత్నం, పీఏసీఎస్ చైర్మన్ సీతారామయ్య, సొసైటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేశిరెడ్డి

చాట్రాయి: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రజాప్రతినిధులకు సహకరించాలని ఏపీ కోఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజాప్రతినిధులు అధికారులకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని ఎంపీపీ లంకా నిర్మల, జనార్దనవరం ఎంపీటీసీ పోతురెడ్డిపల్లి కృష్ణ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై దేశిరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు అధికారులతో మాట్లాడినపుడు స్పందించాలని, లేకుంటే సంబంధిత అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలను తెరచి చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రి తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చెలికాని అనూష, ఎంపీడీవో కె.దుర్గాప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కరువు నష్టం అంచనా వేసిన కేంద్ర బృందం



లక్ష్మీపురంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్ర బృందం

లక్ష్మీపురం(తిరువూరురూరల్): మండలంలో వర్షాభావం కారణంగా ఎండిపోయిన పంటలను కేంద్ర అధికారుల బృందం గురువారం పరిశీలించింది. లక్ష్మీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించిన అధికారులు రైతులను కలిసి పంటనష్టం వివరాలను తెలుసుకున్నారు. భూగర్భ జలాలను పరిశీలించడంతో పాటు సాగునీటి సమస్యకు గల కారణాలను ఆరా తీశారు.

గుళ్లపూడిలో పర్యటన

గుళ్లపూడి(గంపలగూడెం): మండలంలోని గుళ్లపూడిలో అంతర మంత్రిత్వ కేంద్ర బృందం గురువారం పర్యటించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, గంపలగూడెం మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది. దీంతో కేంద్ర బృందం సభ్యులు ఆయా గ్రామాల్లో పర్యటించి ఎండిపోయిన వరి పొలాలు, పత్తి చేలను పరిశీలించారు. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర బృందంతో రైతు సంక్షేమ విభాగ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్, ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పొన్నుస్వామి, మహేష్‌కుమార్, సంసద్ ఆదర్శ గ్రామీణ యోజన అండర్ సెక్రటరీ కైలాస్ శుక్లా, జిల్లా జాయింట్ కలెక్టర్ సంపత్‌కుమార్, తిరువూరు ఆర్డీవో మాధవి, వ్యవసాయ సంయుక్త సంచాలకులు కెనడీ, ఏవోలు పద్మ, సాయిశ్రీ ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే 'ఆడుదాం ఆంధ్రా'



చంద్రాలలో కిట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత



విస్సన్నపేటలో కిట్‌లు అందజేస్తున్న నాయకులు

చంద్రాల(మైలవరం): నియోజకవర్గంలో ప్రతిభ గల క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా పోటీలను నిర్వహిస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మండలంలోని చంద్రాల గ్రామంలో ఆడుదాం ఆంధ్రా కిట్‌లను ఎమ్మెల్యే గురువారం క్రీడాకారులకు పంపిణీ చేసి, వారిని అభినందించారు. దాదాపు నెలన్నర పాటు ఈ పోటీలు జరుగుతాయని, ఆరోగ్యకర జీవన శైలికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. యువత చదువుతో క్రీడల పట్ల ఆసక్తి చూపాలన్నారు. క్రీడా పోటీల నిర్వహణలో అన్ని శాఖలు భాగమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా కిట్ల పంపిణీ

విస్సన్నపేట: త్వరలో జరగనున్న ఆడుదాం ఆంధ్రాకు సంబంధించి క్రీడా కిట్లను సంబంధిత వ్యాయామోపాధ్యాయులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి గురువారం పంపిణీ చేసారు. వివిధ క్రీడలకు సంబంధించి ఆట వస్తువులు, బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, ఎంఈవో సుధాకర్, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఎంపీటీసీ సభ్యుడు జి.మల్లయ్య, ఏఎంసీ డైరెక్టర్ రెడ్డి శేషగిరి, ఉప సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, వ్యాయమోపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలను విజయవంతం చేయాలి

ముసునూరు: ప్రతి గ్రామంలోని 15 ఏళ్లు నిండిన యువత ఆడుదాం ఆంధ్రా క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్ పిలుపునిచ్చారు. మండలంలోని గుళ్లపూడి, సూరేపల్లి గ్రామ సచివాలయాల వద్ద ఎంపీడీవో జి.రాణి ఆధ్వర్యంలో క్రీడా మెటీరియల్స్, కిట్లు గురువారం పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీ రాజానాయన, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, సర్పంచ్ ఆర్.శ్రీదేవి శ్రీనివాస్, ఉప సర్పంచ్ పద్మజా రాంబాబు, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, పార్టీ సీనియర్ నేతలు వెంకట్రావు, ధర్మరాజు, గ్రామ పార్టీ అధ్యక్షుడు రామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శులు స్రవంతి, ప్రసాద్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడలు ఈనెల 26 నుంచి నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.రాణి గురువారం తెలిపారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై టీడీపీ దాడి

నూజివీడు: తమను పట్టించారనే అక్కసుతో టీడీపీకి చెందిన కొందరు మండలంలోని జంగంగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడి చేసి గాయపరిచిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఐదు రోజుల క్రితం జంగంగూడెం ఫారెస్ట్‌లో జామాయిల్‌ను అక్రమంగా నరికి తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. అయితే తమను పట్టించినది వైఎస్సార్‌సీపీకి చెందిన వారేనని భావించి మధ్యాహ్నం 3 గంటల సమయంలో గ్రామంలో గొడవకు దిగి దాడి చేయడంతో తొమ్మండ్రు సురేష్, కే జయరాజు, కే రవిబాబు గాయపడ్డారు. వారు నూజివీడు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై వివరాలు సేకరిస్తున్నామని, ఇంకా కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ తలారి రామకృష్ణ పేర్కొన్నారు.

భూముల రీ సర్వేపై గ్రామసభ

కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి గ్రామంలో నిర్వహించిన భూముల రీ సర్వేపై గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మండల తహసీల్దార్ కె.లక్ష్మి గ్రామసభ నిర్వహించారు. తాడేపల్లి గ్రామంలో రైతులకు సంబంధించిన 1,863 ఎకరాల వ్యవసాయ భూములున్నట్లు రీ సర్వేలో వెల్లడైందన్నారు. గ్రామంలో కొంత మంది రైతుల పేర్లతో అడంగల్స్ లేవని వాటిని మార్పు చేయాలని సర్పంచ్ ఉయ్యూరు గోపాలరావు అధికారులను కోరారు. ఆ మార్పులను త్వరలోనే చేస్తామని తహసీల్దార్ తెలిపారు. డీటీ ప్రవీణ్‌రెడ్డి, సర్వేయర్ రమేష్, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.